
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



మామిడి.. కష్టమేనా దిగుబడి?
ఈ ఏడాది మామిడి పూత అంతంతగానే ఉండడం.. పూత వచ్చినా నిలవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



ఆయిల్‌పామ్‌పై పరిశోధనలు
ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్నందున మరిన్ని పరిశోధనలు చేయాలని హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 13°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉదయం, రాత్రి చలిగాలుల తీవ్రత ఉంటుంది. మిగతా సమయాన కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మరిన్ని పరిశోధనలు అవసరం..

- కలెక్టర్, ఐటీడీఏ పీఓగా మంచి అధికారులు వచ్చారు
- వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల
- కలెక్టర్ పాటిల్ మునగ శాస్త్రవేత్త అంటూ కితాబు
- వ్యవసాయ కళాశాల ద్వారా రైతులకు అండగా నిలవాలని సూచన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కలెక్టర్ పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే జారె, హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి తదితరులు

అశ్వారావుపేట: వ్యవసాయ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరముందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత కళాశాల ఆవరణలో సాగు చేస్తున్న మామిడి, ఇతర పంటలను పరిశీలించగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ వివరాలు వెల్లడించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచి అధికారులైన కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ ఉన్నారని తెలిపారు. కలెక్టర్ వ్యవసాయ శాస్త్రవేత్త కావాలని కలలు కన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో కలెక్టర్ కావాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ ఆయన మునగ సాగులో రైతులను ప్రోత్సహించేలా శాస్త్రవేత్తగా మారారని కితాబిచ్చారు.ఆయిల్‌పామ్‌లోనూ అంతరపంటగా మునగ సాగు చేయొచ్చని తెలిపారు. వ్యవసాయ కళాశాలను అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నందున ప్రతిపాదనలు పంపాలని మంత్రి సూచించారు.

ఇంకా ఎవరేం అన్నారంటే...

■ ములకలపల్లి మండలంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్నందున రైతులు దూరం వెళ్లకుండా ములకలలపల్లి మండలంలోనే పామాయిల్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని నూతన విధానాలు, ఆధునిక వ్యవసాయాన్ని రూపొందించాలన్నారు. అలాగే, అశ్వారావుపేట నియోజకవర్గంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ పాటలు పాడారు.

■ రైతే నిజమైన రాజు అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వెల్లడించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తాను మునగ సాగును ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. భూమాత నుంచి మనం పంటలు తీసుకునే క్రమంలో రసాయన ఎరువుల వాడకం ద్వారా నష్టం చేస్తున్నామని చెప్పారు. ఈమేరకు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయంపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు.

■ వ్యవసాయ రంగంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉండగా... ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోందని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. అశ్వారావుపేట ప్రాంతం ఆయిల్‌పామ్ సాగుకు కేంద్రంగా ఉన్నందున వ్యవసాయ రంగంలో వినూత్న ప్రయోగాల ద్వారా నూతన వంగడాల రూపకల్పన, సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.రాజిరెడ్డి, ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి, డీఎస్పీ సతీష్‌కుమార్, ఐటీపీఆర్ చీఫ్ సైంటిస్టులు ఎంవీ.ప్రసాద్, కె.రామచంద్రుడు, మధిర ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి, వైరా, కొత్తగూడెం కేవీకేల శాస్త్రవేత్తలు కె.రవి, లక్ష్మీనారాయణ, రైతులు ఆలపాటి రామచంద్రప్రసాద్, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపయోగమేదీ?

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల స్థానిక రైతాంగానికి ఉపయోగపడడం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ సీఎంగా, తాను మంత్రిగా ఉన్నపుడు ఏర్పాటైన వ్యవసాయ కళాశాల నుంచి గడిచిన 35ఏళ్లలో 2,500 మంది పట్టభద్రులు బయటకు వచ్చారని, ఇక్కడ చదువుకున్న వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు. అశ్వారావుపేట కళాశాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చినా ఇక్కడి పరిశోధనలు, మేధా సంపత్తి స్థానిక రైతాంగానికి ఉపయోగపడడం లేదని చెప్పారు. ఇకనైనా రైతాంగానికి సాగులో మెళకువలు నేర్పితే ఫలితముంటుందని తెలిపారు. ఇక్కడ పండే పంటలతో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు శాస్త్రవేత్తలు సూచనలు చేయాలన్నారు. తన పక్క తోటలో రాలి పడిన ఆకులను ఏరుకెళ్లే వారు రూ.2చొప్పున చెల్లించి విస్తారాకులు తయారుచేసి అమ్ముకుంటారని తెలిపారు. ఇలా ప్రతీ పంటకు బై ప్రొడక్ట్స్ తయారు చేసేలా సూచనలు చేయాలని చెప్పారు. కలెక్టర్, ఎస్పీ ఉద్యోగాల కన్నా రైతు ఉద్యోగమే గొప్పదని, భవిష్యత్ మొత్తం రైతాంగానిదేనని ఆయన వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచంలో చాలామంది తిండికి లేక అల్లాడినా రైతన్న నాగలి ఆపకుండా సాగు చేయడంతో అందరం కడుపునిండా తినగలిగామని తెలిపారు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన


కల్యాణక్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపించిన అర్చకులు.. ఆతర్వాత ప్రత్యేకంగా అలంకరించిన స్వామిని పల్లకీ సేవగా బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రాధారణ చేశాక నిత్య కల్యాణతంతు కనులపండువగా జరిపించారు. రెండో శనివారం సెలవు కావడంతో స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాగా, ఆదివారం రామయ్య సన్నిధిలో కృత్తికాదీపోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం శనివారం పవిత్ర గోదావరి జలాలను తీసుకొచ్చి యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. కృత్తికా దిపోత్సవం నేపథ్యాన ఆదివారం నిత్యకల్యాణాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

256 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా జిల్లాలోని ఇప్పటి వరకు 256 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించామని కొత్తగూడెం ఎస్ఈ జి.మహేందర్ తెలిపారు. ప్రతిపాదించిన 267లో 256 ఆవాసాలకు కనెక్షన్లు ఇవ్వగా మిగతా వాటికి అటవీశాఖ ఆమోదం లభించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యాన వంద శాతం గిరిజన పల్లెల్లో విద్యుదీకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. తద్వారా ఆయా ప్రాంతాలు అన్ని రంగాలు అభివృద్ధి చెందడానికి ఆస్కారముంటుందని వెల్లడించారు. అయితే, లైన్లు వేయలేని ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ అందుబాటులో ఉంటుందని ఎస్ఈ ఓ ప్రకటనలో తెలిపారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి


ఎన్యుమరేటర్లతో మాట్లాడుతున్న డైరెక్టర్ గోపి

వైరా: పశుగణనను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా కచ్చితమైన లెక్కలు తేల్చాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి సూచించారు. వైరా మండలం స్టేజీ పినపాకలో పశుగణనను శనివారం ఆయన జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కే.వీ.నారాయణతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా గోపి మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు పశు గణన చేస్తూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అలాగే, ప్రతీ ఇంట్లో పశువులను పెంచి పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.కిషోర్, ఎం.రాకేష్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి


తరగతులను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ అనురాధ

కారేపల్లి: వయస్సు, విద్యార్హతలతో సంబంధం లేకుండా పదో తరగతి, ఆతర్వాత ఇంటర్ చదివే అవకాశమున్న ఓపెన్ స్కూల్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ కోఆర్డినేటర్ అనురాధ సూచించారు. కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ సెంటర్‌ను శనివారం పరిశీలించిన ఆమె తరగతులకు హాజరైన వారితో మాట్లాడారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈనెల 16వ తేదీ వరకు అవకాశముందని, ప్రతీ ఆదివారంతో పాటు రెండో శనివారాల్లో తరగతులు ఉంటాయని తెలిపారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఉద్యోగులు నసీరుద్దీన్, ముండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతోగు అడవుల్లో పెద్ద పులి?

- పులి అరుపులు వినిపించాయని గ్రామస్తుల వెల్లడి
- విస్తృతంగా గాలిస్తున్న అటవీ అధికారులు


పులి పాదముద్రల కోసం పరిశీలిస్తున్న అటవీ అధికారులు

గుండాల: వారం క్రితం ములుగు జిల్లాలో సంచరించిన పెద్దపులి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడవుల్లోకి అడుగుపెట్టినట్లు మూడు రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని అధికారులు సైతం నిర్ధారించారు. అయితే, ఆళ్లపల్లి మండలంలోని దొంగతోగు గ్రామస్తులకు సమీప అడవుల నుంచి శనివారం తెల్లవారుజామున పులి అరుపులు వినిపించాయని పలువురు చెబుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యాన సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు పులి అడుగుజాడల కోసం అన్వేషణ ప్రారంభించారు. నిన్నామొన్నటి వరకు ములుగు జిల్లా మంగపేట, తాడ్వాయి, కరకగూడెం అడవుల్లో పులి సంచరించగా తాజాగా గుండాల రేంజ్‌లోకి అడుగు పెట్టినట్లు తెలుస్తోంది. దీనికి తోడు పులి అరుపులు వినిపించాయనే సమాచారంతో దొంగతోగు, ముత్తాపురం, సజ్జల బోడు, నడిమిగూడెం గ్రామాల రైతులు శనివారం చేన్లలో పనికి వెళ్లడానికి వెనుకంజ వేశారు. దొంగతొగు గ్రామానికి కిన్నెరసాని అభయారణ్యం సమీపాన ఉండడంతో పులి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని.. చేన్ల వద్దకు ఒంటరిగా వెళ్లొద్దని అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు ఒకవేళ వెళ్లినా సాయంత్రం త్వరగా ఇళ్లకు చేరుకోవాలని సూచిస్తున్నారు. పెద్దపులి రోజుకు 20 కి.మీ. చొప్పున తిరిగే అవకాశమున్నందున రోజుకో ప్రాంతంలో అరుపులు వినిపిస్తున్నాయని తెలుస్తోంది. గుండాల, ఆళ్లపల్లి, రేగళ్ల రేంజర్లు నరసింహారావు, సురేష్, జస్వంత్ ఆధ్వర్యాన నీటి వనరులు ఉన్నచోట అమర్చిన సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ముమ్మరంగా గాలింపు

కరకగూడెం: కరకగూడెం మండలం రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం పెద్ద పులి పాదముద్రలను గుర్తించిన నేపథ్యాన అటవీ అధికారులు విస్తృతంగా గాలిస్తున్నారు. శనివారం సైతం మండలంలోని పలు గ్రామాల పరిధి అటవీ ప్రాంతాల్లో మణుగూరు ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ మక్సూద్, ఏడూళ్ల బయ్యారం రేంజర్ ఉపేందర్ ఆధ్వర్యాన మూడు బృందాలు అన్వేషణ కొనసాగించాయి. అయితే, ఎక్కడా పులి జాడ లేకపోయినా స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో
భాస్కర్ చిరస్మరణీయుడు

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


భాస్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు, వనమా, కాంతారావు తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఉద్యమంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదురొడ్డి నిలబడి చివరి శ్వాస వరకు బీఆర్ఎస్ ఎదుగుదలకు కృషి చేసిన మోరె భాస్కర్ చిరస్మరణీయుడని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. కొత్తగూడెంలోని రామవరంలో శనివారం నిర్వహించిన భాస్కర్ సంస్మరణ సభలో పాల్గొన్న ఎంపీ.. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తదితరులతో కలిసి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే, పార్టీ తరఫున భాస్కర్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీతో పాటు కాంతారావు, వనమా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన భాస్కర్ పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌తో పాటు నాయకులు ఉప్పలపాటి వెంకటరమణ, నాగా సీతారాములు, దయానంద్, హరిసింగ్, కెంగర్ల మల్లయ్య, ఆకునూరి కనకరాజు, బండి రాజుగౌడ్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, తొగరు రాజశేఖర్, హుస్సేన్, మధు, అనుదీప్, మోరె రమేశ్, మోరె రూప, భాస్కర్ సతీమణి పార్వతి, కుమారులు పవన్ కల్యాణ్, చాణక్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, దళిత సంఘం నాయకులు మద్దెల శివకుమార్, అంతోటిపాల్, అంతోటి నాగేశ్వరరావు, రవీందర్, అల్లి శంకర్, కొప్పరి నవతన్‌తో పాటు ఐఎన్‌టీయూసీ నాయకులు రజాక్, మల్లారపు కొమరయ్య, సుద్దాల శంకర్‌రెడ్డి, బత్తిని రాజశేఖర్, సీతారాం, రఫీ, రహెమాన్ తదితరులు కూడా భాస్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

నేడు 'ఈస్తటిక్స్' పురస్కారాల సభ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాల సభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ బాధ్యులు పి.రవిమారుత్ తెలిపారు. 2024 సంవత్సరానికి గాను కవిత్వం, కథల పోటీల్లో విజేతలకు ఈ సభలో పురస్కారాలు అందించడమే కాక బహుమతులు పొందిన కథలతో రూపొందించిన సంకలనాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. కవిత్వం విభాగంలో జూగంటి జగన్నాథం రచించిన కవితా సంపుటి 'ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు' రూ.40 వేల బహుమతి గెలుచుకోగా, తెలుగు వెంకటేష్ రాసిన 'కబోజి చేపల కబుర్లు', రాళ్లబండి శశిశ్రీ రాసిన 'అనుమంద్రం' కవితా సంపుటిలు ప్రత్యేక ప్రశంసా అవార్డులకు, విశిష్ట పురస్కార సంపుటిగా ఎస్.గోపి రాసిన 'క్రియ ఒక జీవన లయ' ఎంపికైందని తెలిపారు. కథల విభాగంలో ఉత్తమ కథగా కేవీఎస్.ప్రీతమ్ రాసిన 'నూరేళ్ల మోసే తల్లికథ' రూ.25వేల బహుమతి గెలుచుకుందని వెల్లడించారు. రెండు, మూడు స్థానాల్లో సయ్యద్ గఫార్ రచించిన 'న్యూ బాబాయిజం' రూ.15 వేల బహుమతి, కరీం రాసిన 'ఝూజా' రూ.10వేల బహుమతికి ఎంపికయ్యాయని తెలిపారు. ఖమ్మం డీపీఆర్సీ హాల్‌లో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు మొదలయ్యే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సాహితీప్రియులు పాల్గొనాలని రవిమారుత్ కోరారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇంధన పొదుపు వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని టీజీ రెడ్కో సంస్థ మేనేజర్ కె.మనోహర్ రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 20వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించనుండగా, ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాక ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించేలా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు మేనేజర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్


మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్


కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుత సమాజంలో రాజీ మార్గమే మార్గదర్శకమని.. అందులో భాగంగా సత్వర న్యాయం అందేలా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తెలిపారు. రాజీ మార్గంలో నడిచిన వారు ఇంకొందరికి ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడంతో కుటుంబాల్లో కలతలు పెరిగాయని తెలిపారు. చిన్నపాటి గొడవలు, క్షణికావేశంలో చేసిన నేరాలతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న పలువురు విలువైన కాలం, డబ్బు వృథా చేసుకుంటున్నారని చెప్పారు. ఈక్రమంలో కక్షిదారులు ఒక అడుగు రాజీ మార్గం దిశగా ప్రయత్నం చేస్తే ప్రతివాదులు రెండడుగులు తగ్గుతారని తద్వారా ఇరువురికీ తక్షణ న్యాయం అందుతుందని తెలిపారు. ఈమేరకు పలు కేసులను పరిశీలించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రామారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ.సుచరిత, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు, బ్యాంక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. కాగా, కక్షిదారులకు యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ ఆధ్వర్యాన పులిహోర, తాగునీటి సౌకర్యం కల్పించారు.

50 బీఎస్ఎన్ఎల్ కేసుల పరిష్కారం

జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌తో బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి 50 కేసులు పరిష్కారమయ్యాయని ఏఓ ప్రేమలత తెలిపారు. ఫోన్ బిల్లు బకాయిలను 50 మంది రూ.లక్ష మేర చెల్లించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఏజీఎం సుభాష్, ఎస్‌డీ సత్రు, జేటీఓ సందీప్, ఓఎస్ శివరాంజీ పాల్గొన్నారు.

గ్రూప్–2కు అంతా సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో 123 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 41,566 మంది అభ్యర్థులు
- అర గంట ముందు వరకే కేంద్రాల్లోకి అనుమతి



కొత్తగూడెం అర్బన్/ఖమ్మంసహకారనగర్: ఉమ్మడి జిల్లాలో గ్రూప్–2 పరీక్షలు ఆది, సోమవారం జరగనున్నాయి. రెండు రోజుల పాటు రెండేసి సెషన్లలో పరీక్షలు జరగనుండగా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్ పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. నిర్ణీత సమయానికి అరగంట ముందు వరకే అభ్యర్థులకు కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని.. ఆతర్వాత గేట్లు మూసివేస్తామనే అంశంపై విస్తృతంగా ప్రచారం చేశారు.

ఖమ్మంలో 85, భద్రాద్రిలో 38 సెంటర్లు

గ్రూప్–2 పరీక్ష నిర్వహణకు ఖమ్మం జిల్లాలో 85 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ జిల్లాలో 28,101 మంది అభ్యర్థులకు పరీక్షలకు హాజరుకానున్నారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో 13,465 మంది అభ్యర్థుల కోసం 38 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇందులో కొత్తగూడెంలో 25, పాల్వంచలో 13 కేంద్రాలు ఉన్నాయి. కాగా, పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా జరిగేలా అధికారులు వారం రోజులుగా సమీక్షిస్తున్నారు.

రెండు సెషన్లలో పరీక్షలు..

షెడ్యూల్ ప్రకారం ఆది, సోమవారాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5–30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం సెషన్‌లో 8–30నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1–30 గంటల నుంచి కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. ఉదయం 9–30, మధ్యాహ్నం 2–30గంటలకు గేట్లు మూసివేసి ఆతర్వాత అభ్యర్థులెవరిని కూడా లోనికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.

అధికారుల పర్యవేక్షణలో..

ఖమ్మం జిల్లాలో పరీక్షల పర్యవేక్షణకుఇద్దరు రీజినల్ కోఆర్డినేటర్లను నియమించారు. ఇందులో విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య రీజినల్ కోఆర్డినేటర్–1గా 40 కేంద్రాలు, ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్ రీజనల్ కోఆర్డినేటర్– 2గా 45 కేంద్రాలను పర్యవేక్షిస్తారు. అంతేకాక డీఆర్వో, ఆర్డీఓ నేతృత్వాన స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేస్తారు. ఇందుకోసం ఎంపీడీఓలను జాయింట్ రూట్ అధికారులుగా, ప్రతీ 3–5 కేంద్రాల తనిఖీకి తహసీల్దార్లను ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా నియమించారు. కాగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతీ అభ్యర్థికి ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్లు రూపొందించినందున సదరు అభ్యర్థి వచ్చినా, రాకున్నా వారి సీటు వద్ద ఓఎంఆర్ షీట్ పెడతారు. పరీక్ష సమయానికి ఐదు నిమిషాల ముందు ప్రశ్నాపత్రాలు అందించనున్నారు. ఇక ప్రతీ గదిలో కేవలం 24 మందికే సీటింగ్ కేటాయించి తాగునీరు, వైద్యశిబిరాలు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. అంతేకాక అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేందుకు రెండు రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించనుంది.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

బోనకల్: ప్రజాప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.21.41కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల, జానకీపురంలో సీసీ రోడ్లకే కాక వివిధ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి భట్టి శంకుస్థాపన చేశారు. అలాగే, రాపల్లిలో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం పనులకు భూమి పూజ చేశారు. అంతేకాక బోనకల్ తహసీల్ పక్కన ఏర్పాటు చేసిన స్త్రీ టీ పాయింట్‌ను ప్రారంభించిన భట్టి, బోనకల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో భట్టి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూనే మధిర నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఈఓ పుల్లయ్య, ఐకేపీ ఏపీఎం పద్మలత, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిశోర్, బంధం నాగేశ్వరావు, గాలి దుర్గారావు, కర్నాటి కోటి, చేబ్రోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'భక్తరామదాసు' నీటి విడుదల


ఇస్లావత్ తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వలోకి చేరుతున్న జలాలు

తిరుమలాయపాలెం: పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లోని చెరువులు నింపేందుకు గాను భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు. కూసుమంచి మండలంలోని ఎర్రగడ్డ తండా వద్ద శనివారం భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయగా సాయంత్రానికి తిరుమలాయపాలెం మండలంలోని ఇస్లావత్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వల్లోకి చేరాయి. కాగా, అన్ని చెరువులు నిండే వరకు నీటి విడుదల కొనసాగుతుందని జల వనరుల శాఖ డీఈ బాణాల రమేష్‌రెడ్డి తెలిపా రు. అయితే, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవా లని, కాల్వల తూముల వద్ద నీట మళ్లింపునకు య త్నించొద్దని కోరారు. రబీ వరిసాగుతో పాటు ఇతర ఆరుతడి పంటల సాగు చేస్తున్న నేపథ్యాన నీరు విడుదల చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ జితేశ్ వి.పాటిల్



మట్టి ఇటుకలు తయారు చేస్తున్న కలెక్టర్

ములకలపల్లి: స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. మండలంలోని రామాంజనేయపురంలో మట్టి ఇటుకల తయారీని శనివారం ఆయన పరిశీలించారు. ములకలపల్లిలోని మంగపేట పీహెచ్‌సీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి కావాల్సిన ఇటుకలను స్థానికంగానే తయారు చేయాలని గతంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యాన కలెక్టర్ పీహెచ్‌సీని పరిశీలించి ఇటుకల తయారీపై ఆరా తీశారు. అయితే, కాంట్రాక్టర్ తమ స్వగ్రామమైన రామాంజనేయపురంలో తయారు చేసినట్లు చెప్పగా అక్కడకు వెళ్లి పరిశీలించి కూలీలతో మాట్లాడారు. స్థానికంగా ఇటుకల తయారీతో కూలీలకు ఉపాధి లభించడమే కాక కాంట్రాక్టర్‌కు ఖర్చు తగ్గుతుందని తెలిపారు.

ఏడుగురు మావోయిస్టుల అరెస్టు

వివరాలు వెల్లడించిన సుక్మా ఎస్పీ కిరణ్‌చవాన్



పట్టుబడిన మావోయిస్టులతో ఎస్పీ, పోలీస్ అధికారులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని జేగురుగొండ సమీపాన అటవీ ప్రాంతంలో ఏడుగురు మావోయిస్టులను అరెస్టు చేసినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. సుక్మాలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఏడుగురు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకునే క్రమాన పారిపోయేందుకు యత్నించారని తెలిపారు. దీంతో సీఆర్‌పీఎఫ్ 150 బెటాలియన్, కోబ్రా 201 బెటాలియన్, డిస్ట్రిక్ట్ ఫోర్స్ విభాగాల బలగాలు వెంబడించి అదుపులోకి తీసుకోగా మావోయిస్టులుగా తేలిందని చెప్పారు. వీరి నుంచి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్పీ తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడిని హతమార్చిన మావోయిస్టులు

చర్ల: పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో మావోయిస్టులు ఓ యువకుడిని హతమర్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధి దూలేడు గ్రామానికి రెండు రోజుల క్రితం పెద్ద సంఖ్యలో వచ్చిన మావోయిస్టులు గ్రామానికి చెందిన మడకం హిడ్మాను అదుపులోకి తీసుకోవడమే కాక గ్రామంలో సుమారు 100 నుంచి సెల్‌ఫోన్లను లాక్కున్నారు. ఆతర్వాత హిడ్మాను వెంట తీసుకెళ్లి హతమర్చగా మృతదేహాన్ని శనివారం ఉదయం గ్రామ శివారులో పడవేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందునే ఆయనను హతమార్చామని మావోయిస్టు పార్టీ కుంట ఏరియా కమిటీ పేరిట లేఖ వదిలారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

చర్ల: దుమ్ముగూడెం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చింతగుప్ప ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను శుక్రవారం అర్ధరాత్రి అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. ఎఫ్ఆర్‌ఓ కమల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చింతగుప్ప మీదుగా బొలేరో వాహనంలో కలప తరలిస్తున్నారన్న సమాచారం మేరకు చింతగుప్ప అటవీ మార్గంలో నిఘా వేసి పట్టుకున్నారు. రూ.2 లక్షల విలువైన 11 టేకు దిమ్మెలు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేశామని ఎఫ్ఆర్‌ఓ తెలిపారు.

మహిళను రక్షించిన స్థానికులు



మహిళను రక్షిస్తున్న స్థానికులు

భద్రాచలం అర్బన్: గోదావరిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జి పైనుంచి ఓ మహిళ దూకబోతుండగా స్థానికులు రక్షించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టణంలోని కొర్రాజులగుట్టకు చెందిన ఓ మహిళ తన బిడ్డను బ్రిడ్జిపై వదిలేసి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. గమనించిన స్థానికులు మహిళను రక్షించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మామిడి.. కష్టమేనా దిగుబడి?

- చెట్లకు అరకొరగానే కనిపిస్తున్న పూత
- పూత వచ్చినా ఆ వెంటనే చీడపీడలు
- అధికారులు అవగాహన కల్పించకపోతే రైతులకు నష్టమే..



పూత కనిపించని మామిడితోట, (ఇన్‌సెట్) వచ్చిన పూత ఇలా మాడిపోతోంది

ఇల్లెందురూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఫలరాజుగా గుర్తింపు పొందిన ఈ పంటలో కొన్ని సీజన్లుగా రైతులు ఆశించినట్లుగా కాత రావడం లేదు. ఏటా పూత దశలో వాతావరణం అనుకూలంగా లేకపోవడం, చీడపీడలు ఆశించడం వంటి కారణాలు రైతులను వేధిస్తున్నాయి. ఈ సీజన్‌లోనూ మామిడి రైతులకు అవే సమస్యలు పునరావృతమై ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం పూత రావడానికి, వచ్చిన పూత నిలబెట్టుకోవడానికి రైతులు పలు రూపాల్లో తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 57 వేల ఎకరాల్లో సాగు

ఉమ్మడి జిల్లాలో సుమారుగా 57 వేల ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, ములకలపల్లి, చండ్రుగొండ, పాల్వంచ, టేకులపల్లి, జూలూరుపాడు మండలాల్లో, ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల పరిధిలో అత్యధిక విస్తీర్ణంలో మామిడిని సాగు చేస్తున్నారు. ముఖ్యంగా బంగినపల్లి, దశేరీ, కేసరి, హిమాయత్, రాయల్ స్పెషల్, తోతాపూరి, చిన్నరసాలు, పెద్దరసాలు తదితర రకాలను సాగు చేస్తున్నారు.

కనిపించని పూత

కొన్నేళ్లుగా మామిడిలో నిర్దేశిత సమయం కన్నా ముందుగా లేదా ఆలస్యంగా పూత వస్తోంది. ఈ ప్రభావం మామిడి దిగుబడిపై తీవ్రంగా చూపుతోందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా వాతావరణ పరిస్థితులు, మామిడి రకాలను బట్టి డిసెంబర్ నుంచి జనవరి వరకు మొగ్గలు వస్తాయి. కానీ, ప్రస్తుతం డిసెంబర్ నెల సగం గడిచినా మామిడితోటల్లో పూత సరిగా కనిపించడం లేదు. పూసిన ఆ కాస్త పూత కూడా పక్షం రోజుల కిందట వచ్చిన తుపాన్ ప్రభావంతో చాలా వరకు రాలిపోయింది. ఉన్న కాసింత పూతకు చీడపీడలు ఆశించాయి. దీంతో అవి చెట్టుపైనే మాడిపోతున్నాయి. చీడపీడల నివారణకు పురుగుమందులను విపరీతంగా పిచికారీ చేస్తున్నా ఆశించిన ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు.

ఇప్పుడే అవగాహన కల్పిస్తే మేలు

సుదీర్ఘకాలం తరువాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉద్యాన పంటలకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. గతంలో జిల్లాలో పనిచేసిన ఉద్యాన అధికారిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో వచ్చిన అధికారి అనతికాలంలోనే అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డాడు. దీంతో ఉద్యాన పంటలపై అధికారుల పర్యవేక్షణ తగ్గింది. ఇటీవల ఓ అధికారి బాధ్యతలు స్వీకరించినా ఉద్యాన పంటలపై దృష్టి సారించకపోవడం, ఆయిల్‌పామ్ సాగుపై మాత్రమే శ్రద్ధ పెట్టడం.. క్షేత్రస్థాయి సిబ్బంది అరకొరగా ఉండటం వంటి కారణాలతో ఉద్యాన పంటలపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. అంతేకాకుండా ఏడాది కాలంగా జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గినా, ప్రస్తుతం మామిడికి పూత కనిపించపోయినా.. ఉద్యానశాఖ అధికారులలో చలనం లేకపోవడం రైతులకు శాపంగా పరిణమిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పూత దశలో మేలైన యాజమాన్యం

మామిడిలో పూత దశలో తీసుకునే సస్యరక్షణ చర్యలే ప్రధానం. ఈ దశలో చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడిని రైతులు పొందగలుగుతారు. మామిడిలో పూతకు ముందు నుంచే పలురకాల చీడపీడలు ఆశిస్తాయి. వీటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానశాఖ నిపుణుల సూచనలిలా ఉన్నాయి. తేనెమంచు పురుగు ఆకులు, కాడలు, పూత నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. గొంగళి పురుగు మొగ్గదశలో తన ప్రభావాన్ని చూపుతుంది. దీనికోసం పూమొగ్గ దశ నుంచే సస్యరక్షణ చర్యలు ప్రారంభించాలి. దీని కోసం లీటర్ నీటికి అర మిల్లీలీటర్ డైక్లోరోవాస్ లేదా 3 గ్రాముల కార్బరిల్‌ను కలిపి చెట్టులోపలి అన్ని భాగాలు తడిచేలా పిచికారీ చేయాలి. పచ్చి పూత, నల్లపూత దశల్లోనూ వీటి నివారణ చేపట్టాలి. బూడిత తెగులు, బూజు వేర్ల పోషకాలను పీల్చటం వల్ల పూలు పిందెలు వడలిపోయి రాలిపోతాయి. బూడిద తెగులు నివారణకు మొగ్గ దశలో లీటరు నీటికి 3 గ్రాముల నీటిలో కరిగే గంధకాన్ని, పూత దశలో లీటరు నీటికి హెక్సాకోనజోల్ 2 మి.లీ లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ మందును కలిపి పిచికారీ చేయాలి. మంగును కలిగించే దీపపు పురుగుల నిరోధానికి ఎకరాకు 60 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 50 గ్రాముల థయోమిథాక్సిమ్, 200 గ్రాముల కార్బండిజంను కలిపి పిచికారీ చేయాలి. మామిడిచెట్లను నిరంతరం గమనిస్తూ ఏవైనా అసహజ లక్షణాలుంటే నిపుణులతో నిర్ధారించుకొని తగిన యాజమాన్యం చేపడితే మంచి కాత వస్తుంది.

చీడపీడలతో ఆందోళన



ఏటా మామిడిలో వస్తున్న చీడపీడలు నష్టాల బారిన పడేస్తున్నాయి. ఈసారి కూడా డిసెంబర్ సగానికి చేరినా పూత కనిపించడం లేదు. ఉన్న కొద్దిపాటి పూత కూడా మాడిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండటం లేదు. జాగ్రత్తలు సూచించే అధికారుల జాడ కనిపించడం లేదు.

–మంచె కృష్ణయ్య, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో శనివారం జరిగిన వేడుకల్లో పంట ఉత్పత్తులతో కూడిన స్టాళ్లు ఏర్పాటు చేయగా రైతులు ఆసక్తిగా పరిశీలించారు. ప్రధాన వేదిక సమీపాన ఏర్పాటు చేసిన స్టాళ్లను హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం స్టాళ్లలో ఉత్పత్తులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, అధికారులతో పాటు రైతులు, కళాశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖ, నాబార్డు సంస్థ, ప్రకృతి సేద్యంతో సాగు చేసిన పంటలు, కూరగాయలను ఇక్కడ ప్రదర్శించారు. అలాగే, కేవీకే, కొబ్బరి బోర్డు ఆధ్వర్యాన డ్రిప్ పరికరాలు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వివిధ రకాల వంగడాలను సైతం ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.

– అశ్వారావుపేటరూరల్



ప్రదర్శనలో ఆయిల్‌పామ్ మొక్క, గెలలు



కొబ్బరి గెలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ పాటిల్ తదితరులు



స్టాళ్లను ప్రారంభిస్తున్న హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి

'సంక్షోభంలోకి వ్యవసాయ రంగం'



సభ్యత్వాలు అందజేస్తున్న హేమంతరావు

రఘునాథపాలెం: కేంద్ర, రాష్ట్ర పాలకులు రైతాంగాన్ని విస్మరించి పాలన సాగిస్తుండడంతో వ్యయసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెంలో రైతు సంఘం సభ్యత్వ నమోదును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కార్ రైతాంగ ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగా ఆరు నెలలుగా దేశ రాజధాని సరిహద్దుల్లో రైతులు ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. ఇక రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకునే రీతిలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. నాయకులు శాఖమూరి శ్రీనివాసరావు, బాగం ప్రసాద్, రావెళ్ల సురేష్, బానోత్ రవి, తాళ్లూరి నాగ, రంగారావు, బానోత్ నర్సింహ, రావెళ్ల నాగభూషణం పాల్గొన్నారు.

జీవన స్థితిగతులు మెరుగుపడాలి

- కొండరెడ్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట: మూలవాసులైన పూసుకుంటలోని కొండరెడ్ల జీవన స్థితిగతులు మెరుగుపడేలా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. దమ్మపేట మండలం పూసుకుంటలోని కొండరెడ్ల ఆవాసాల వద్ద శనివారం ఆయన కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పలు అంశాలపై సమీక్షించారు. పూసుకుంట నుంచి ప్రధాన రహదారికి వెళ్లడానికి అవసరమైన బీటీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణంపై సూచనలు చేయగా అటవీ శాఖ నుంచి అభ్యంతరాలు చెప్పొద్దని తెలిపారు. అలాగే, ఐటీడీఏ ఆధ్వర్యాన బోర్లు వేయించి విద్యుత్ సౌకర్యం కల్పించడమే కాక ఆయిల్‌పామ్ మొక్కలు నాటించాలని ఐటీడీఏ పీఓకు సూచించారు. ఫలసాయం వచ్చే వరకు ఆ తోటల్లో రైతులు చేసిన పనికి ఉపాధి హామీ ద్వారా వేతనాలు ఇప్పించాలని తెలిపారు. అంతేకాక పక్కాగృహాల మంజూరు, విద్యాభ్యాసంపై సూచనలు చేశారు.



కొండరెడ్లతో మంత్రి తుమ్మల, కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే జారే, పీఓ రాహుల్

తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలి

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు శ్రద్ధగా చదివి గొప్ప స్థానాలకు చేరుకోవడం ద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని గండుగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నూతన మెనూ అమలును శనివారం ఆయన కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే ఆదినారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన గతంతో పోలిస్తే డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. డీఆర్‌డీఓ విద్యాచందన, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్, ఆర్‌డీఓ మధు, మార్కెట్ చైర్మన్ వాసం రాణితో పాటు ఆలపాటి రామచంద్రప్రసాద్, మద్దిశెట్టి సత్యప్రసాద్, ఎల్లిన రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్ పాం'పై పరిశోధనలు చేయాలి

హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న ఆయిల్ పాం తోటలపై అవసరమైన పరిశోధనలు చేయాలని హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి సూచించారు. శనివారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల వేడుకలకు హాజరైన ఆయన స్థానిక శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఆకస్మికంగా సందర్శించారు. నూతన వంగడాల పరిశోధనలు, తోటలు, మొక్కల్ని పరిశీలించి సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా సాగులో ఉన్న పామాయిల్ తోటల్లో వచ్చే దిగుబడులు, లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలోగల పామాయిల్ తోటలను సందర్శించి, సాగు పద్ధతుల గురించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.కిరణ్‌కుమార్, డాక్టర్ జి.విజయకృష్ణ, రైతులు ఆలపాటి రామచంద్రప్రసాద్, బండి భాస్కర్ ఉన్నారు.



పరిశోధన కేంద్రంలో సూచనలు చేస్తున్న రాజిరెడ్డి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు: మండలంలోని మోతె పట్టీనగర్ గ్రామంలో అప్పుల బాధతో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం .. దుమ్ముగూడెం మండలం ఎం.కాశీనగర్ గ్రామానికి చెందిన అరవింద్‌కుమార్(25) రెండేళ్లుగా మోతె పట్టీనగర్‌లో నివాసం ఉంటూ ఐటీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అరవింద్‌కు భార్య సమత, కుమార్తె ఉన్నారు. ఆర్నెళ్ల కిందట మోతె పట్టీనగర్‌లో ఇంటిస్థలం కొని ఇల్లు నిర్మాణం చేపట్టగా అప్పులయ్యాయి. అవి తీరే మార్గం కనిపించక శుక్రవారం రాత్రి భార్య, కుమార్తె నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య నిద్ర నుంచి లేచి చూసేసరికి భర్త ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారిని పిలిచి అతడిని భద్రాచలం ఏరియాస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ఎన్టీఆర్



వేడుకల్లో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయే మహోన్నత వ్యక్తి నందమూరి తారకరామారావు అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యాన ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ పి.నీరజ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా.. ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి తుమ్మల తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో విశేష సేవలందించి తెలుగువారి కీర్తిని ప్రపంచ పటంలో నిలిపిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆతర్వాత ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని సన్నివేశాలు, పాటలను ప్రదర్శించారు. కార్పొరేటర్లు రావూరి కరుణ, కమర్తపు మురళి, మిక్కిలినేని మంజుల నరేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, తుమ్మల యుగంధర్, రావూరి సైదుబాబు, నల్లమల ఆనంద్, సంద్ర రాంబాబు, ఆళ్ల అంజిరెడ్డి, నాళం సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించాక కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్‌చంద్రతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, మల్లాది హన్మంతరావు, మంద వెంకటనారాయణ, ఓర్స్ కృష్ణ, తలపనేని జయరాం పాల్గొన్నారు.

మనోవేదనతో యువకుడు..



గోవర్ధన్ (ఫైల్)

జూలూరుపాడు: కుటుంబ సమస్యలతో మనోవేదనకు గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌హెచ్‌ఓ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని గుండెపుడి గ్రామపంచాయతీ పరిధి రామచంద్రాపురానికి చెందిన ఈసం రాము – వెంకటలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు గోవర్ధన్ (18) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కొంత కాలంగా మద్యానికి బానిసై తన ఆలనాపాలన, చదువు పట్టించుకోవడం లేదని గోవర్ధన్ బాధపడుతూ పడమటనర్సాపురంలోని అమ్మమ్మ, తాతయ్య ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చేసుకు వెళ్లిన అమ్మమ్మ – తాతయ్య వచ్చేసరికి విగతజీవుడై ఉన్నాడు. తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహబూబాబాద్ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సలగట్టు హరిబాబు(46) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొన్నాళ్ల క్రితం భార్య నుంచి విడిపోయిన ఆయన మరో మహిళతో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈనెల 11న జమాండ్లపల్లిలోని బంధువుల ఇంట్లో వేడుకకు ఆటోలో వచ్చిన ఆయన అదేరోజు రాత్రి తిరిగి బయలుదేరాడు. మధ్యలో వెంకటగిరి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన హరిబాబుకు చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తన భర్త మృతిపై అనుమానం ఉందని ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.



సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

TO-LET

■ కొత్త బస్టాండ్ పాత బస్టాండ్ మధ్యలో గల సరిత క్లినిక్ బిల్డింగ్‌లో ఫస్ట్ ఫ్లోర్ అద్దెకు కలదు. వివరాలకు సంప్ర. సెల్ : 98481 55799, 9849877980. [M-1185446]

HOUSE FOR SALE

■ మణుగూరు గాంధీబొమ్మ సెంటర్ దగ్గరలో ఉన్న ఇల్లు అమ్మకానికి కలదు. డైరెక్ట్ ఫోన్ : 97016 79202 [L-794880]

■ ఖమ్మం జిల్లా, మధిర-అంబేడ్కర్ సెంటర్, గీతా మందిర్ రోడ్‌లో తూర్పు ముఖం (298 చ॥గ॥ స్థలం + బిల్డింగ్) గల 6-70 హౌస్ అమ్మబడును. ధర : రూ॥ 68 లక్షలు. వివరాలకు సం॥ 97014 83054, 63054 42306. [M-1233837]

PLOT FOR SALE

■ ఖమ్మం, రంగనాయకుల గుట్ట దగ్గర, మెయిన్ రోడ్‌కు 150 చదరపు గజాల ప్లాట్స్ అమ్మబడును. వివరాలకు సంప్రదించవలసిన సెల్ :94911 09909, 98490 25144. [M-1253947]

■ ఖమ్మం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణపరిధిలో 48 నెలల బైబ్యాక్ అగ్రిమెంట్‌తో DTCP ప్లాట్లు, స్పాట్ రిజి॥లోన్ Ph: 9390189907 [SCA24000717]

Services

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపార రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సలహాలకు సంప్రదించండి : 7297898678. [T-293]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000795]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6124]

Wanted

■ Universal యాడ్స్ కంపెనీకి మొబైల్‌లో SMSలు పంపుతూ వారానికి 5000 నుండి 6000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418 [M-1256003]

■ పనివారు కావలెను HYD, బెంగుళూరులో ఉండి ఇంటి, వంటపని, వృద్ధుల సేవ, పిల్లలపోషణకి స్త్రీలు కావలెను. ఫోన్: 9391912949/ 04040123376 [SCA24000716]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ - విజయవాడ) బ్రాంచీల కొరకు బైక్ మెకానిక్స్ వెంటనే కావలెను. భోజనం+ వసతి + జీతం: 20-30,000/- ✆ 94406 71190 [B-1172523]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA24000827]

■ Hyderabad Meds Pharmacy. మా ఫార్మసీలో (ఖమ్మంలో) Pharmacist (with PCI) Pharma Aid మరియు any Medical Experience కలిగిన యువతీ, యువకులు కావలెను. వివరాలకు సంప్ర. సెల్: 79898 50856, 89780 23734 [M-1185442]

■ సిగ్నేచర్ ఫిలిం సిటీలో పని చేయుటకు సివిల్ ఇంజనీర్, వీడియో ఎడిటర్స్, డీఓపీ కెమెరా మెన్, రిసెప్షనిస్ట్, కార్ డ్రైవర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, వెబ్‌సైట్ డిజైనర్స్, యాప్ డెవలపర్స్ కావలెను. 93931 31111. [M-1256002]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్. ✆ 91332 71122, 95534 61177 [B-1172531]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 15-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1172526]

■ శ్రీనివాస గ్రూపు, (నాగోల్, హైదరాబాద్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు 10th ఆపైన చదివిన 20-30 సం. వయస్సు గల M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 99636 91122, 92814 65315 [B-1172528]

■ సైట్ సూపర్ వైజర్లు, సైట్ అకౌంటెంట్స్ & ఆటోమేషన్ కార్ డ్రైవింగ్‌లో అనుభవం ఉన్న డ్రైవర్స్ కావలెను. సంస్థ పేరు: PVC Projects, Hyd., 040-23338080, Email : adm.vineela@gmail.com. (సమయం: 10 am- 5pm Sunday - Chegunta & Monday - punjagutta) [H-804885]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.